

చెత్త పనులను ప్రశ్నించే వారేరీ..?

పాఠశాలల్లో పేరుకుపోయిన చెత్తను అపాయకర పరిస్థితుల్లో విద్యార్థులతో తొలగించిన అధికారుల తీరును మరువక మునుపే.. పిఠాపురంలో మరిన్ని వింత పోకడలు వెలుగుచూశాయి.

8లో



కాలువలకు 10,700 క్యూసెక్కులు

ధవళేశ్వరం: గోదావరి డెల్టా కాలువలకు బుధవారం 10,700 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. తూర్పు డెల్టాకు 3,200, మధ్య డెల్టాకు 2,000, పశ్చిమ డెల్టాకు 5,500 క్యూసెక్కులు వదిలారు.

రంజాన్ వేళలు

	ఇఫ్తార్ గురువారం (సాయంత్రం)	సహర్ శుక్రవారం (ఉదయం)
రాజమండ్రి	6.22	4.46
కాకినాడ	6.23	4.46
అమలాపురం	6.23	4.46

న్యూస్‌రీల్

రెండో రోజూ 'పది' ప్రశాంతం

18,861 మంది విద్యార్థుల హాజరు

ముమ్మిడివరం: పదో తరగతి పరీక్షలు రెండో రోజైన మంగళవారం ప్రశాంతంగా జరిగాయి. జిల్లాలోని 22 మండలాల్లో ఏర్పాటు చేసిన 110 పరీక్షా కేంద్రాల్లో మంగళవారం జరిగిన హిందీ పరీక్షకు 18,861 మంది విద్యార్థులు హాజరయ్యారు. వీరిలో 26 మంది ప్రైవేటు విద్యార్థులు ఉన్నారు. మొత్తం 98 మంది గైర్హాజరయ్యారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12.45 గంటల వరకు పరీక్షలు జరిగాయి. మొత్తం 99.48 శాతం మంది హాజరైనట్టు జిల్లా విద్యాశాఖాధికారి డా.షేక్ సలీం బాషా తెలిపారు. పరీక్షా కేంద్రాలను ఆర్‌జేడీ జి.నాగమణి, డీవైఈవో జి.సూర్య ప్రకాష్, ప్రభుత్వ పరీక్షల విభాగం అసిస్టెంట్ కమిషనర్ బి.హనుమంతరావుతో పాటు, ఐదు ఫ్లయింగ్ స్క్వాడ్ల వారు మొత్తం 54 పరీక్షా కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేసినట్టు డీఈఓ సలీం బాషా తెలిపారు.

ఏకైక కేంద్రంలో ఇంటర్మీడియెట్ పరీక్ష

అమలాపురం టౌన్: ఇంటర్మీడియెట్ ఫస్టియర్ జాగ్రఫీ పరీక్ష ఆలమూరు ప్రభుత్వ జూనియర్ కళాశాల పరీక్షా కేంద్రంలో బుధవారం ప్రశాంతంగా జరిగిందని డీఐఈవో వనుము సోమశేఖరరావు తెలిపారు. ఈ పరీక్షకు మొత్తం 16 మందికి ఒక్క విద్యార్థి మాత్రం హాజరు కాలేదు. మిగిలిన 15 మంది విద్యార్థులు పరీక్షలు రాశారని సోమశేఖరరావు చెప్పారు. ఇదే జాగ్రఫీ పరీక్ష గురువారం కూడా ఒకే ఒక పరీక్షా కేంద్రంలో సెకండియర్ విద్యార్థులకు జరుగుతుందని తెలిపారు.

అభయాంజనేయుడికి వెండి కిరీటం సమర్పణ



అభయాంజనేయ స్వామికి వెండి కిరీటాన్ని అలంకరిస్తున్న దాతలు

అమలాపురం టౌన్: పట్టణంలోని ఆర్టీసీ బస్ స్టేషన్ వద్ద మెయిన్ రోడ్డులో ఉన్న అభయాంజనేయస్వామి ఆలయంలో స్వామికి భక్తులు వెండి కిరీటాన్ని బహూకరించారు. స్థానిక గాంధీనగర్‌కు చెందిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగి కొల్లాటి సాయిరామ్, వీరవేణి దంపతులు రూ.1.50 లక్షలతో తయారు చేయించిన వెండి కిరీటాన్ని బుధవారం సమర్పించారు. ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు చేసి, వేద మంత్రాల నడుమ స్వామికి కిరీటాన్ని అలంకరించారు.

అమ్మవారి హుండీల ఆదాయం రూ.5.98 లక్షలు



హుండీల లెక్కింపులో పాల్గొన్న అధికారులు

సఖినేటిపల్లి: కేశవదాసుపాలెం శివారు మెండుపాలెంలో ఉన్న పెద్దింట్లమ్మ అమ్మవారి ఆలయంలో వివిధ హుండీల ద్వారా మొత్తం రూ.5,98,613 ఆదాయం వచ్చింది. బుధవారం ఆలయం వద్ద ఎండోమెంట్స్ ఇన్‌స్పెక్టర్ జె.రామలింగేశ్వరరావు, అంతర్వేది ఆలయ అసిస్టెంట్ కమిషనర్ వి.సత్యనారాయణ, ఎస్సై కె.దుర్గా శ్రీనివాసరావు సమక్షంలో హుండీలను తెరిచి 19 రోజుల ఆదాయాన్ని లెక్కించారు. విదేశీ కరెన్సీ పది దిర్హమ్స్ ఉన్నాయి.

ఈ-కేవైసీ పూర్తి చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న డీఎస్‌ఓ

అమలాపురం రూరల్: ప్రభుత్వ పథకాల సమగ్ర అమలుకు నూరు శాతం ఈ-కేవైసీ పూర్తి చేయాలని జిల్లా పౌర సరఫరాల అధికారి అడపా ఉదయభాస్కర్ అన్నారు. బుధవారం కలెక్టరేట్ గోదావరి భవన్‌లో రేషన్ డీలర్లకు ఈ-కేవైసీపై అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ నెలాఖరులోగా ఈ-కేవైసీ పూర్తి చేయాలని స్పష్టం చేశారు. అన్ని రేషన్ షాపుల్లో డీలర్లు ఈ-పాస్ యంత్రంతో ఉదయం 8 నుంచి 12 వరకు, సాయంత్రం 4 నుంచి రాత్రి 8 గంటల వరకు అందుబాటులో ఉంటారన్నారు. మార్చి 20 నుంచి 31 వరకు ఈ కార్యక్రమం కొనసాగుతుందన్నారు. రాష్ట్రంలో ఎక్కడైనా ఈ-కేవైసీ చేయించవచ్చన్నారు.

వివాదారులు

- కొత్త అలైన్‌మెంట్‌తో సరికొత్త తలనొప్పులు
- జాతీయ రహదారి-216ఈ కొత్త అలైన్‌మెంట్
- ఇందుపల్లి జనావాసాల మీదుగా భూసేకరణకు సిద్ధం
- స్థానికుల నుంచి తీవ్ర వ్యతిరేకత
- ప్రత్యామ్నాయ మార్గాలున్నా పట్టించుకోవడం లేదని విమర్శలు
- గత ప్రభుత్వ హయాంలో నడిపూడి నుంచి భట్నవిల్లి వరకు నిర్మాణం
- ఈదరపల్లి నుంచి ఇందుపల్లి కాలువ గట్టు మీదుగా మరో ప్రత్యామ్నాయ మార్గం
- వివాదాలపై దృష్టి పెట్టని అధికారులు

రెండు జాతీయ రహదారులను అనుసంధానం చేస్తూ.. జిల్లాలో కొత్తగా నిర్మిస్తున్న మరో జాతీయ రహదారి నిర్మాణ అలైన్‌మెంట్ చుట్టూ వివాదాలు ముసురుకుంటున్నాయి. జాతీయ రహదారి-216 – జాతీయ రహదారి-216ఎ మధ్యన మరో జాతీయ రహదారి నిర్మాణం కోనసీమలో కొత్త వివాదాలకు కారణమవుతోంది. రావులపాడు నుంచి పేరూరు వరకు నిర్మించ తలపెట్టిన 216ఈ భూసేకరణ కొన్ని గ్రామాల్లో ఆందోళనకు దారితీస్తోంది.




ఈదరపల్లి వంతెన నుంచి ఇందుపల్లి వంతెన మీదుగా పేరూరు వెళ్లే రహదారి

సాక్షి, అమలాపురం: జిల్లాలో రెండు కీలక జాతీయ రహదారులున్నాయి. వీటిలో ఒకటి కాకినాడ జిల్లా కత్తిపూడి నుంచి ఒంగోలు వరకున్న 216 జాతీయ రహదారి కాగా, రెండోది తూర్పు గోదావరి జిల్లా లాలాచెరువు నుంచి ఏలూరు జిల్లా గుండుగొలను వరకు రావులపాలెం మీదుగా వెళ్లే 216ఎ రహదారి. ఈ రెండు రహదారులను అనుసంధానం చేస్తూ మరో జాతీయ రహదారి 216ఈ నిర్మాణానికి కేంద్ర ఉపరితల రవాణా మంత్రిత్వ శాఖ అనుమతి ఇచ్చింది. కోనసీమ జిల్లాలో గణనీయమైన అభివృద్ధికి కీలకంగా మారనున్న ఈ రహదారి నిర్మాణానికి గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలోనే పునాదులు పడ్డాయి.

అలైన్‌మెంట్ మార్పుతో వివాదాలు

216ఈ జాతీయ రహదారి తొలి ప్రతిపాదన అమలాపురం మండలంలో పేరూరు వద్ద ఎన్‌హెచ్-216లో మొదలై.. ఇందుపల్లి వంతెన మీదుగా ఈదరపల్లి వంతెన వరకు, అక్కడి నుంచి ముక్కామల, కొత్తపేట సమీపంలోని పలివెల వంతెన మీదుగా రావులపాలెం సమీపంలోని రావులపాడు వద్ద జాతీయ రహదారి 216ఎ వద్ద కలిసేలా ప్రతిపాదించారు. అప్పట్లో రూ.400 కోట్లతో ఈ రహదారి నిర్మాణానికి ప్రతిపాదనలు చేశారు. ఈ రహదారి నిర్మాణానికి సంబంధించి రావులపాడు నుంచి ఈదరపల్లి వంతెన వరకు పెద్దగా అభ్యంతరాలు లేవు. ఇక్కడ వరకు రహదారి అమలాపురం పంట కాలువను అనుకుని వస్తుంది. అక్కడి నుంచి పేరూరు వరకూ చేపట్టే నిర్మాణాలకు సంబంధించి అలైన్‌మెంట్ పైనే వివాదాలు నెలకొన్నాయి. తొలి ప్రతిపాదన చూస్తే.. ఇందుపల్లి కాలువ గట్టు, పేరూరు వద్ద ఇళ్ల తొలగింపు ఎక్కువగా ఉన్నందున, కొత్త అలైన్‌మెంట్ మార్పునకు ఎన్‌హెచ్ అధికారులు సర్వే చేపట్టారు. గత ప్రభుత్వ హయాంలో ఈ రహదారిని నడిపూడి లాకుల కన్నా ముందు నుంచి జనుపల్లి మీదుగా భట్నవిల్లి వద్ద జాతీయ రహదారి 216లో కలపాలనే ప్రతిపాదన వచ్చింది. ఈ ప్రాంతంలో కొత్తగా గ్రీన్‌ఫీల్డ్ రహదారి నిర్మాణం చేయడం వల్ల ఇళ్ల తొలగింపు పెద్దగా ఉండదు. భూసేకరణకూ ఇబ్బందులు తక్కువే. కానీ ప్రభుత్వం మారిన తర్వాత ఎన్‌హెచ్ అధికారులు కొత్త ప్రతిపాదన తెరపైకి తెచ్చారు.



జాతీయ రహదారి 216ఈ మ్యాప్. గ్రీన్ కలర్ లైన్ వివాదానికి కారణమైన ఎన్‌హెచ్ ప్రతిపాదిత రహదారి. రెడ్ కలర్ లైన్ (ఈ రహదారుల మీదుగా ఎన్‌హెచ్ నిర్మించాలని కోరుతున్నారు). వైట్ కలర్ లైన్ (గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో ప్రతిపాదించిన రహదారి ఇది. భట్నవిల్లి వద్ద జాతీయ రహదారిలో కలుస్తోంది)



ఇందుపల్లి కాలువ నుంచి పేరూరు ఎఫ్‌సీఐ గోడౌన్స్ మీదుగా కొత్తగా నిర్మించిన రోడ్డు

స్థానికుల ప్రతిఘటన

నడిపూడి లాకులు దాటాక బాబూ జగ్జీవన్‌రామ్ కల్యాణ మంటపం దాటిన తరువాత ఈదరపల్లి టీటీడీ కల్యాణ మంటపం మీదుగా, ఇందుపల్లి వంతెన సమీపంలోని ఇళ్ల మీదుగా, ఎఫ్‌సీఐ గోడౌన్, బీవీసీ ఇంజినీరింగ్ కాలేజీ వెనుక నుంచి పేరూరు వంతెన సమీపంలోని ఎన్‌హెచ్-216లో అనుసంధానం కానుంది. నడిపూడి లాకుల నుంచి పేరూరు వరకు ఏకంగా 31.600 కి.మీ. మేర గ్రీన్‌ఫీల్డ్ రహదారి నిర్మించాల్సి ఉంది. ఇందుకు రూ.700 కోట్లతో తాజాగా అంచనాలు రూపొందించారు. పలుచోట్ల ఇళ్ల తొలగింపు చేయాల్సి ఉన్నందున స్థానికుల నుంచి ప్రతిఘటన వ్యక్తమవుతోంది. ఇప్పటికే ఇందుపల్లి గ్రామంలో ఇళ్లు పోగొట్టుకునేవాళ్లు, రైతులు కలెక్టరేట్‌లో గత సోమవారం నిర్వహించిన గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేశారు. ఇళ్లను కోల్పోవడమే కాకుండా, ముంపు ముప్పు అధికంగా ఉంటుందని వారు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈదరపల్లి, ఇందుపల్లి వంతెనల నుంచి పేరూరు వంతెన వరకు ఇప్పుడున్న రహదారి మీదుగా జాతీయ రహదారి నిర్మించాలని కోరుతున్నారు. ఈదరపల్లి వంతెన వద్ద నుంచి ఇందుపల్లి వంతెన మీదుగా పేరూరు వరకు ఇప్పుడున్న రహదారిని గతంలో జాతీయ రహదారుల సంస్థ తమ ఆధీనంలోకి తీసుకుంది. జాతీయ రహదారిని 25 మీటర్ల మేర విస్తరించనున్నారు. ఇప్పుడున్న ఈదరపల్లి నుంచి ఇందుపల్లి మలుపు వరకు, అక్కడి నుంచి కొత్తగా నిర్మించిన రహదారి మీదుగా జాతీయ రహదారి నిర్మించాలని వారు కోరుతున్నారు. ఇప్పుడున్న రహదారిలో ఆక్రమణలు తొలగించి, జాతీయ రహదారిగా విస్తరిస్తే సరిపోతోందని వారు చెబుతున్నారు. ఇందుపల్లి కాలువ గట్టు రోడ్డు కూడా నూతనంగా నిర్మించడం వల్ల ఏకంగా ఏడు కి.మీ. మేర గ్రీన్‌ఫీల్డ్ రహదారి నిర్మించాల్సిన అవసరం లేదని అంటున్నారు.

ఇందుపల్లి ముంపు ప్రాంతం

సాకుర్రు గున్నేపల్లి, ఇందుపల్లి తరచూ ముంపు బారిన పడే గ్రామాలు. గోదావరి వరద ప్రత్యక్షంగా ఆయా గ్రామాలపై ప్రభావం చూపించకున్నా, పరోక్షంగా గ్రామాలను ముంచెత్తుతోంది. మురుగునీటి కాలువ వ్యవస్థ అధ్వానంగా మారడం వల్ల ఆయా గ్రామాల మీదుగా పారే ఎగువ కౌశిక వరద నీరు, వర్షాల నీరు ఎగదన్ని గ్రామాలను ముంచివేస్తోంది. పంటలతో పాటు, ఇళ్లు, ఇతర ఆస్తులు నీట మునుగుతున్నాయి. ఈ క్రమంలో ఇందుపల్లి మీదుగా ఐదు నుంచి పది అడుగుల ఎత్తున హైవే నిర్మిస్తే, ముంపు తీవ్రత మరింత పెరిగే అవకాశముందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇది సమీపంలో ఉన్న ఈదరపల్లి, బండారులంక గ్రామాలపై కూడా ప్రభావం చూపుతోందంటున్నారు.

ఈదరపల్లి నూతన వంతెన నిర్మాణం



కూనవరం మేజర్ డ్రెయిన్‌లో డ్రెడ్జింగ్ పనులను పరిశీలిస్తున్న కలెక్టర్ మహేష్‌కుమార్

- రూ.2 కోట్ల అంచనాతో ప్రణాళిక
- ఆక్రమణల తొలగింపునకు అధికారులతో కమిటీ
- జిల్లా కలెక్టర్ మహేష్‌కుమార్

అమలాపురం రూరల్: జిల్లా కేంద్రమైన అమలాపురంలో ట్రాఫిక్ సమస్యలు పరిష్కరించే దిశగా ఈదరపల్లి వద్ద నూతన వంతెన నిర్మాణాన్ని రూ.2 కోట్ల అంచనా వ్యయంతో చేపడుతున్నట్టు జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ వెల్లడించారు. బుధవారం కలెక్టరేట్‌లో వివిధ శాఖల అధికారులతో ఆయన సమావేశం నిర్వహించారు. వంతెనకు ఇరువైపులా ఆక్రమణలను తొలగించడానికి కమిటీని ఏర్పాటు చేశారు. ఆయన మాట్లాడుతూ, పట్టణవాసుల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని ఈ వంతెన నిర్మాణానికి తక్షణమే కలెక్టరేట్ నుంచి రూ.2 కోట్లు మంజూరు చేశామన్నారు. కోనసీమ జిల్లా కేంద్రంలో పురాతన వంతెనలు ట్రాఫిక్ రద్దీకి తగ్గట్టుగా లేని దృష్ట్యా వీటిని విస్తరించాల్సిన అవసరం ఉందన్నారు. బ్రిటిష్ వారు నిర్మించిన వంతెనలపైనే రాకపోకలు సాగుతున్న నేపథ్యంలో ట్రాఫిక్ సమస్య తీవ్రంగా ఉందన్నారు. వాహన కమ్యూనికేషన్లు, డేటా ట్రాన్స్‌మిషన్, ట్రాఫిక్ సిగ్నల్స్ తదితర అంశాలను దృష్టిలో పెట్టుకుని దశలవారీ చర్యలు చేపట్టనున్నట్టు తెలిపారు. ఆర్డీఓ కె.మాధవి, ఆర్అండ్‌బీ ఎస్ఈ బి.రాము, జల వనరుల శాఖ డీఈ బి.శ్రీనివాసరావు ట్రాన్స్‌కో ఎస్ఈ ఎస్.రాజబాబు, మున్సిపల్ కమిషనర్ కేవీవీఆర్ రాజు తదితరులతో కమిటీ ఏర్పాటు చేశారు.

త్వరితగతిన డ్రెడ్జింగ్ పూర్తి చేయాలి

ఉప్పలగుప్తం: కూనవరం మేజర్ డ్రెయిన్ డ్రెడ్జింగ్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ ఆదేశించారు. ఎస్.కొత్తపల్లి పంచాయతీ పరిధిలోని రాఘవులపేట నుంచి గచ్చకాయలపొర వరకు కూనవరం మేజర్ డ్రెయిన్‌లో జరుగుతున్న డ్రెడ్జింగ్ పనులను బుధవారం అధికారులతో కలసి కలెక్టర్ పడవలో ప్రయాణించి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పొలాలకు ముంపు బెడద నివారణకు పటిష్ట చర్యలు తీసుకోవాలన్నారు. మేజర్ డ్రెయిన్ ఏటిగట్టును పటిష్టం చేసి, గట్లు దిగువకు జారిపోకుండా జియో టెక్స్‌టైల్ మ్యాట్లను, జియో సింథటిక్ పద్ధతిని వినియోగించేలా ఉపాధి హామీ పథకం అనుసంధానంతో ప్రతిపాదనలు చేయాలని డ్రైనేజీ విభాగం ఇంజినీర్లకు సూచించారు. రాబోయే కాలంలో ఎస్.కొత్తపల్లి పంచాయతీ పరిధి రాఘవులపేట నుంచి గచ్చకాయలపొర వరకు ఏటిగట్టు మీదుగా రోడ్డు మార్గాన్ని ఏర్పాటు చేయాలని సూచించారు. డ్రెయిన్స్ ఈఈ ఎంవీవీ కిషోర్ మాట్లాడుతూ, రూ.3.5 కోట్ల నిధులతో రెండు కి.మీ. మేర డ్రెడ్జింగ్ పనులు చేపడుతున్నామన్నామని చెప్పారు. ఈ పనులు రెండు నెలల్లో పూర్తవుతాయన్నారు. రెండు వైపులా ఏటిగట్టును పటిష్టం చేసేలా ప్రతిపాదనలు సిద్ధం చేస్తామని, వర్షాకాలం సమయానికి 600 మీటర్ల మొగ ప్రాంతంలో పూర్తి స్థాయి తవ్వకాలు చేపడతామని వివరించారు. కలెక్టర్ వెంట తహసీల్దార్ పీఎస్ దివాకర్, డ్రెయిన్స్ ఏఈ కె.సునీతాదేవి ఉన్నారు.

ఈవీఎంలకు పటిష్ట భద్రత కల్పించాలి

ముమ్మిడివరం: ఈవీఎంలను భద్రపర్చిన గోదాములకు పటిష్ట భద్రత కల్పించాలని, పోలీస్ సిబ్బంది నిరంతరం అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ మహేష్‌కుమార్ సూచించారు. బుధవారం ఎయిమ్స్ ఇంజినీరింగ్ కళాశాల మూడో అంతస్తులో ఈవీఎం, వీవీ ప్యాట్లను ఉంచిన గోదాముల వద్ద భద్రతను పరిశీలించారు. త్రైమాసిక తనిఖీల్లో భాగంగా రాజకీయ పార్టీల ప్రతినిధులతో గోదాముల తాళాలు తీసి, ఈవీఎం, వీవీ ప్యాట్లను తనిఖీ చేశారు. సీసీ కెమెరాల పనితీరు, అగ్ని నిరోధక పరికరాలను పరిశీలించారు. గోదాముల వద్ద సీసీ కెమెరాల పర్యవేక్షణలో గట్టి నిఘా ఉంచాలన్నారు. కలెక్టర్ వెంట డీఆర్ఓ బీఎల్ఎన్ రాజకుమారి, తహసీల్దార్ యూ.సుబ్బలక్ష్మి, డిప్యూటీ తహసీల్దార్ శివరాజ్, పలువురు రాజకీయ ప్రతినిధులు ఉన్నారు.

మాలలపై కక్ష గట్టిన చంద్రబాబు



అమలాపురంలో కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న ఐక్యవేదిక ప్రతినిధులు

- కమిషన్ నివేదికను రద్దు చేయాలని డిమాండ్
- కలెక్టరేట్ వద్ద జిల్లా మాల సంఘాల ఐక్య వేదిక ధర్నా

అమలాపురం టౌన్: ముఖ్యమంత్రి చంద్రబాబు మాలలపై కక్షతో ఎస్సీ వర్గీకరణను అడ్డగోలుగా చేయడానికి కుట్ర పన్నుతున్నారని జిల్లా మాల సంఘాల ఐక్య వేదిక కన్వీనర్ జంగా బాబూరావు ఆరోపించారు. రాజ్యాంగ విరుద్ధంగా ఎస్సీల్లో ఓ వర్గానికి లబ్ధి చేకూర్చేలా పావులు కదుపుతున్నారని విమర్శించారు. స్థానిక ప్రెస్ క్లబ్ భవనంలో ఐక్య వేదిక ప్రతినిధులు బుధవారం జిల్లా స్థాయి సమావేశం నిర్వహించారు. జిల్లాలోని 22 మండలాల మాల ముఖ్య నాయకులు పాల్గొని, కార్యాచరణపై చర్చించారు. ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా మరో పోరాటానికి సిద్ధం కావాలని సమావేశం పిలుపునిచ్చింది. దశలవారీగా ఉద్యమాన్ని ఉధృతం చేయాలని నిర్ణయించింది. 2021 జనాభా లెక్కల ప్రకారం ఏకసభ్య కమిషన్ నివేదికను రాజ్యాంగానికి విరుద్ధంగా రాష్ట్ర కేబినెట్ ఆమోదించడం సిగ్గుచేటని నాయకులు దుయ్యబట్టారు. ప్రజా సమస్యలను పక్కనపెట్టిన చంద్రబాబు ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణే ధ్యేయంగా పనిచేస్తోందని ఆరోపించారు. వర్గీకరణ వల్ల మాల, ఎస్సీల్లోని 59 ఉప కులాలు తీవ్రంగా నష్టపోతున్నాయని ఐక్యవేదిక ప్రధాన కార్యదర్శి ఇసుకపట్ల రఘుబాబు ఆందోళన వ్యక్తం చేశారు. ఏకసభ్య కమిషన్ నివేదికను రద్దు చేసి, హైకోర్టు సిట్టింగ్ జడ్జిలతో త్రిసభ్య కమిషన్‌ను నియమించి, న్యాయ విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. 2025 కుల గణనను పరిగణనలోకి తీసుకుని, ఉప కులాల అభిప్రాయాలు విన్న తర్వాతే వర్గీకరణ జోలికి వెళ్లాలని సూచించారు. మాలల ఉద్యమాన్ని రాష్ట్ర స్థాయిలో తీవ్రతరం చేస్తామని, వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో చంద్రబాబు ప్రభుత్వానికి తగిన బుద్ధి చెబుతామని ఐక్యవేదిక ప్రతినిధి, అముడా మాజీ చైర్మన్ గొల్లపల్లి డేవిడ్‌రాజు హెచ్చరించారు.

డీఆర్వోకు వినతి

అనంతరం ఐక్య వేదిక నాయకులు జిల్లా కలెక్టరేట్‌కు ప్రదర్శనగా వెళ్లి, అక్కడ ధర్నా నిర్వహించారు. మాలల పంతం.. చంద్రబాబు అంతం, ఎస్సీ వర్గీకరణ రాజ్యాంగ విరుద్ధం అంటూ నినాదాలు చేశారు. ఈ మేరకు వినతిపత్రాన్ని డీఆర్వోకు అందజేశారు. ఐక్యవేదిక నాయకులు రేవు తిరుపతిరావు, గెద్దం సురేష్‌కుమార్, పాలమూరి మోహన్‌బాబు, పెనుమాల చిట్టిబాబు, దేవరపల్లి శాంతికుమార్, జిత్తుక సత్యనారాయణ, ఉబ్బన శ్రీను, నెల్లి లక్ష్మీపతి తదితరులు పాల్గొన్నారు.

కూటమి వారి లాటరీ!

సింగిల్ నంబర్ లాటరీ కేరాఫ్ కాకినాడ



- మూడు డెన్‌లు.. రూ.30 లక్షలు
- గంట గంటకూ నంబర్ షో
- ఒకటికి ఎనిమిది రెట్లు
- బెంగళూరు కేంద్రంగా కాయ్ రాజా కాయ్!
- 'తమ్ముళ్ల' కనుసన్నల్లో లాటరీ
- శ్రమజీవుల బతుకులు గుల్ల
- పోలీసుల ప్రేక్షక పాత్ర
- ముఖ్య నేతల జేబుల్లోకి నాలుగో వంతు

సాక్షి ప్రతినిధి, కాకినాడ: సింగిల్ నంబర్ లాటరీకి కేరాఫ్‌గా కాకినాడ నిలుస్తోంది. బెంగళూరు నగరంలోని రెండు ముఖ్య కూడళ్ల కేంద్రంగా సాగుతున్న ఈ దందా వెనుక పెద్దల హస్తం ఉండటం విస్మయానికి గురి చేస్తోంది. ఈ లాటరీతో నిరుపేదలు, రోజువారీ శ్రమజీవుల బతుకులు గుల్లవుతున్నాయి. ఒకటికి ఏడు, ఎనిమిదింతలు వస్తుందనే ఆశ చూపి, నిర్వాహకులు నిలువు దోపిడీ చేస్తున్నారు. సింగిల్ నంబర్ లాటరీపై నిషేధం ఉన్నా కూటమి ప్రభుత్వం గద్దెనెక్కాక కాకినాడలో మాత్రం తలుపులు బార్లా తెరిచారు. నెలవారీగా ఎవరి వాటాలు వారి జేబుల్లోకి వెళ్లిపోతూండటంతో గుట్టు చప్పుడు కాకుండా ఈ దందా సాగిస్తున్నారు. ఈ సింగిల్ నంబర్ లాటరీకి కాకినాడ నగరంలోని మూడు పోలీస్ స్టేషన్ల పరిధిలో మూడు డెన్‌లు నడుస్తున్నాయి. ఒకో డెన్‌ను ఇద్దరు తెలుగు తమ్ముళ్లు నిర్వహించుకునేందుకు ఒప్పందాలు జరిగాయి. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో సింగిల్ నంబర్ లాటరీలపై పోలీసులు ఉక్కుపాదం మోపారు. కూటమి ప్రభుత్వం గద్దెనెక్కాక తెలుగు తమ్ముళ్లు అధికారం దన్నుతో ఈ జూద క్రీడను తిరిగి పట్టాలెక్కించారు. సుమారు ఆరు నెలలుగా సాగుతున్న సింగిల్ నంబర్ లాటరీతో రోజూ రూ.లక్షలు చేతులు మారుతున్నా కన్నెత్తి చూసే నాథుడే లేకుండా పోయాడనే విమర్శలు వస్తున్నాయి. సింగిల్ నంబర్ లాటరీ ఉదయం 8 గంటలకు మొదలై రాత్రి 8 లేదా 9 గంటల వరకూ నిర్వహిస్తున్నారు. వీధుల్లో కర్రా బిళ్ల ఆడినట్లుగా బహిరంగంగానే ఆడేస్తున్నారు. దీనిని కట్టడి చేయాల్సిన పోలీసులు అధికార పార్టీలోని ముఖ్య నేతల నుంచి వస్తున్న ఒత్తిళ్లకు తలొగ్గాల్సి వస్తోందని అంటున్నారు. సింగిల్ నంబర్ లాటరీ కొడితే ఒకటికి ఏడెనిమిది రెట్లు అధికంగా వస్తుందనే ఆశతో రెక్కల కష్టాన్నే నమ్ముకున్న శ్రమజీవులు, లారీ డ్రైవర్లు, క్లీనర్లు, ఇతర పేదల బతుకులు గుల్లయిపోతున్నాయి.

ఇవీ డెన్‌లు

కాకినాడ సంజయ్‌నగర్ లారీ సీరియల్ ఆఫీసు సమీపాన సింగిల్ నంబర్ లాటరీ నడుస్తోంది. ఈ డెన్ కాకినాడ పోర్టు పోలీసు స్టేషన్ పరిధిలోకి వస్తోంది. కాకినాడ రాగంపేట పరిధిలో మూడో పట్టణ పోలీసు స్టేషన్‌కు కూతవేటు దూరంలో కల్పనా సెంటర్ ఫ్లై ఓవర్ కింద మరో డెన్ నిర్వహిస్తున్నారు. మూడో డెన్ జగన్నాథపురం చారిటీస్ వద్ద నూకాలమ్మ టెంపుల్ వెనుక ఉన్న పార్కు సమీపాన జరుగుతోంది. ఈ ప్రాంతం వన్ టౌన్ పోలీసు స్టేషన్ పరిధిలోకి వస్తుంది. ఈ మూడు కేంద్రాల్లోనూ కూటమికి చెందిన ద్వితీయ శ్రేణి నేతల కనుసన్నల్లోనే సింగిల్ నంబర్ లాటరీ జరుగుతోంది.

ఇలా జరుగుతోంది

బెంగళూరుకు చెందిన లాటరీ నిర్వాహకులు ఒకటి నుంచి తొమ్మిది నంబర్లు (సింగిల్ డిజిట్) మొబైల్‌లో డిస్‌ప్లే చేస్తారు. కాకినాడలో లాటరీ డెన్ నడుపుతున్న నిర్వాహకుడు మొబైల్‌లో ఒకటి నుంచి తొమ్మిది నంబర్లలో ఏదో ఒక నంబర్‌ను లాటరీ వేసే వ్యక్తికి సూచిస్తాడు. గంటగంటకూ బెంగళూరు నుంచి నంబర్ షో ఉంటుంది. ఉదాహరణకు ఉదయం 8 గంటలకు సంజయ్ నగర్‌లోని లాటరీ డెన్ వద్దకు వచ్చిన సుబ్బారావు అనే వ్యక్తి ఐదో నంబర్‌పై రూ.వెయ్యి కాశాడని అనుకుంటే.. ఈ విషయాన్ని ఒక కాగితంపై రాసి ఇస్తారు. తొమ్మిది గంటలకు నిర్వాహకుడు మొబైల్‌లో ఏ నంబర్‌కు షో వచ్చిందో చూపిస్తాడు. లాటరీ షోలో ఐదో నంబర్ చూపిస్తే రూ.8 వేలు (రూ.వెయ్యికి ఎనిమిది రెట్లు) తిరిగిస్తారు. అంటే గంటలోనే లాటరీ ఫలితం తేలిపోతుందన్న మాట. మిగిలిందంతా నిర్వాహకులకే. ఇలా ఒక డెన్‌లో రోజుకు 100 నుంచి 200 మంది సింగిల్ నంబర్ లాటరీ ఉచ్చులో పడి జేబులు గుల్ల చేసుకుంటున్నారు. మూడు డెన్‌లలో కలిపి ప్రతి రోజూ తక్కువలో తక్కువ రూ.25 లక్షల నుంచి రూ.30 లక్షల వరకూ చేతులు మారుతున్నాయని తెలుస్తోంది. ఇందులో 5 శాతం కూటమి ముఖ్య నేతలకు, పోలీసులకు ముట్టజెబుతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. సింగిల్ నంబర్ లాటరీలు జరిగే డెన్‌ల వద్ద జనం పెద్ద ఎత్తున గుమిగూడుతూ, గంజాయి, మద్యం మత్తులో తూగుతూ తరచూ ఘర్షణలకు దిగుతున్నారని స్థానికులు చెబుతున్నారు. ఈ ప్రాంతాలు అసాంఘిక శక్తులకు అడ్డాగా తయారయ్యాయని అంటున్నారు.

అంబాజీపేట కొబ్బరి మార్కెట్



కొబ్బరి రకం	ధర (రూ.ల్లో)
కొత్తకొబ్బరి (క్వింటాల్)	14,000 – 14,500
కొత్తకొబ్బరి (రెండవ రకం)	9,500 – 10,000
కురిడీ కొబ్బరి (పాతవి)	
గండేరా (వెయ్యి)	15,500
గటగట (వెయ్యి)	14,500
కురిడీ కొబ్బరి (కొత్తవి)	
గండేరా (వెయ్యి)	14,500
గటగట (వెయ్యి)	13,500
నీటికాయ,పాత (ముక్కుడు)కాయ (వెయ్యి)	13,000 – 13,500
కొత్త (పచ్చి)కాయ (వెయ్యి)	13,000 – 13,500
కొబ్బరి నూనె (15 కిలోలు)	3,750
ఒక కిలో	260

క్లుప్తంగా

వందేళ్ల వృద్ధురాలి కన్నుమూత



సుందరమ్మ(ఫైల్)

నల్లజర్ల: ప్రకాశరావు పాలెంలో వృద్ధురాలు గోగులమండ సుందరమ్మ(100) బుధవారం ఉదయం కన్నుమూశారు. మరణించే వరకూ ఆమె ఆరోగ్యంగానే ఉన్నారని బంధువులు తెలిపారు. ఆమెకు ఐదుగురు మగ, ఇద్దరు ఆడపిల్లలు ఉన్నారు. నలుగురు కుమారులు వివిధ శాఖల్లో గెజిటెడ్ హోదాల్లో పనిచేస్తున్నారు. నాలుగో కుమారుడు గోగుల మండబాబ్జీ వైఎస్సార్ సీపీ లీగల్‌సెల్ మండల అధ్యక్షుడిగా వ్యవహరిస్తున్నారు. ఆమె భర్త వీరాస్వామి కమ్యూనిస్టు ఉద్యమ నేతగా వ్యవహరించారు.

మహిళ మెడలో గొలుసు చోరీ



సంఘటన ప్రదేశంలో వివరాలు సేకరిస్తున్న పోలీసులు

కొవ్వూరు: ఈవెనింగ్ వాకింగ్ చేస్తున్న మహిళ మెడ నుంచి బంగారు గొలుసును దొంగ అపహరించిన ఉదంతమిది. పట్టణంలోని 23వ వార్డుకు చెందిన కుందుల పద్మకుమారి స్థానిక బైపాస్ రోడ్డు బుధవారం ఈవెనింగ్ వాకింగ్‌కు బయలుదేరింది. మోటార్ బైక్‌పై వచ్చిన దొంగ ఆమె మెడలో ఉన్న అరున్నర కాసుల బంగారు గొలుసును తెంచుకుని పరారయ్యాడు. సమాచారం అందుకున్న డీఎస్పీ జి.దేవకుమార్, పట్టణ సీఐ పి.విశ్వం సంఘటన స్థలానికి చేరుకుని, బాధితురాలి నుంచి వివరాలు సేకరించారు. ఆమె ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని సీఐ విశ్వం తెలిపారు. గతంలో కొవ్వూరు పట్టణంలో రెండు చైన్ స్నాచింగ్ సంఘటనలు చోటుచేసుకున్నాయి.

23న జాతీయ సాహిత్య సదస్సు

సఖినేటిపల్లి: మహాకవి, పద్మభూషణ్ బోయి భీమన్న జీవితం, సాహిత్యంపై ఈ నెల 23న రాజమహేంద్రవరంలో జాతీయ సాహిత్య సదస్సు నిర్వహిస్తున్నట్టు శ్రీశ్రీ కళావేదిక అంతర్జాతీయ సీఈఓ కత్తిమండ ప్రతాప్ బుధవారం ఇక్కడ తెలిపారు. ఆ సదస్సులో వంద మంది కవులు పత్ర సమర్పణ చేయనున్నట్టు చెప్పారు. ఆంధ్రప్రదేశ్ భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో ఈ సదస్సు ఏర్పాటు చేశామన్నారు. ముఖ్యఅతిథిగా బోయి భీమన్న సతీమణి బోయి హైమవతి హాజరవుతారని తెలిపారు. సదస్సులో పాల్గొనే కవులందరినీ సత్కరిస్తామని చెప్పారు.

చెత్త పనులను ప్రశ్నించే వారేరీ..?

ఎక్కడ అన్యాయం జరిగినా ప్రశ్నించేస్తామని ఒంటికాలిపై నిలబడే నేతలున్న పార్టీ అది. అవసరమైతే నింగీనేలా ఏకం చేసేస్తామంటే.. జనాలు కూడా నిజమేననుకున్నారు. ఆ పార్టీ ఆవిర్భావ సభ ముగిస్తే కానీ వాస్తవం బోధపడలేదు ప్రజలకు. పార్టీ కార్యక్రమాలకు ప్రజాధనం దుర్వినియోగం, స్థానికసంస్థల సిబ్బందితో పారిశుధ్య పనులు.. తుదకు భావి పౌరులైన విద్యార్థులతో కూడా 'చెత్త' పనులు చేయించి.. వారి నిజ స్వరూపమేమిటో కళ్లకు కట్టినట్టు చూపించారు.

- జనసేన బహిరంగ సభ తర్వాత కానీ బోధపడని వాస్తవం
- పార్టీ చెత్త.. కార్మికులతో, పాఠశాల చెత్త.. విద్యార్థులతో క్లీనింగ్
- ఉపాధి కూలీలతో పారిశుధ్య పనులు
- మున్సిపల్ కార్మికులు, వాహనాల వినియోగం
- ప్రజాధనం దుర్వినియోగంపై పట్టణవాసుల మండిపాటు

పిఠాపురం: పాఠశాలల్లో పేరుకుపోయిన చెత్తను అపాయకర పరిస్థితుల్లో విద్యార్థులతో తొలగించిన అధికారుల తీరును మరువక మునుపే.. పిఠాపురంలో మరిన్ని వింత పోకడలు వెలుగుచూశాయి. ఇటీవల పిఠాపురం మండలం చిత్రాడలో నిర్వహించిన జనసేన ఆవిర్భావ దినోత్సవ సభా ప్రాంగణంలో భారీగా చెత్త పేరుకుపోయింది. దీనిని తొలగించడానికి పార్టీ నేతలు శ్రమిస్తున్నట్టుగా ఫొటోలకు ఫోజులిస్తున్నారు. వాస్తవానికి పిఠాపురం మున్సిపల్ పారిశుధ్య కార్మికులను, ఉపాధి కూలీలను, మున్సిపల్ వాహనాలను వినియోగించి చెత్తను తొలగించారు. ఓ పార్టీ కార్యక్రమానికి పోగైన చెత్తను తొలగించడానికి ప్రజాధనాన్ని దుర్వినియోగం చేయడంపై స్థానికులు తీవ్రంగా మండిపడుతున్నారు. పర్యావరణ శాఖ మంత్రిగా బాధ్యతలు నిర్వహిస్తున్న ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ప్రజాధనాన్ని ఇలా దుర్వినియోగం చేయడాన్ని వారు తప్పుబడుతున్నారు. పార్టీ కార్యక్రమానికి పారిశుధ్య కార్మికులతో పని చేయించడం స్వర్ణాంధ్ర.. పాఠశాల విద్యార్థులతో పారిశుధ్య పనులు చేయించడం స్వచ్ఛాంధ్ర అన్నట్టుగా ఉంది పిఠాపురంలో అధికారుల తీరు. రాజకీయ పార్టీ కార్యక్రమంలో పోగైన చెత్తను మున్సిపల్ పారిశుధ్య కార్మికులతో తీయించి, పాఠశాలలో చెత్తను విద్యార్థులతో తీయించిన ఘనత పవన్ అడ్డాగా చెబుతున్న పిఠాపురం నేతలకే దక్కింది.

ఇటీవల పిఠాపురం మండలం చిత్రాడలో నిర్వహించిన జనసేన ఆవిర్భావ సభ సందర్భంగా టన్నుల కొద్దీ చెత్త వెలువడింది. ఓ రాజకీయ పార్టీకి చెందిన కార్యక్రమం అయినందున, వారి సొంత సొమ్ముతో సభా ప్రాంగణాన్ని శుభ్రం చేయించాల్సి ఉంది. కానీ అధికార దుర్వినియోగం కావాల్సినంత చేసిన జనసేన నేతలు.. మున్సిపల్ పారిశుధ్య కార్మికులతో, ఉపాధి కూలీలతో అంతా శుభ్రం చేయించడం విమర్శలకు దారితీసింది. పట్టణంలో పేరుకుపోయిన చెత్తను వదిలి, మున్సిపల్ సిబ్బంది జనసేన సభా ప్రాంగణంలో పేరుకున్న చెత్తను తొలగించడంపై పట్టణవాసులు మండిపడుతున్నారు. ఇంతవరకు ఎలా ఉన్నా ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ అడ్డాగా చెబుతున్న పిఠాపురంలో విద్యా ప్రదాతగా పేరొందిన పిఠాపురం మహారాజా కలల సాధమైన ఆర్ఆర్‌బీహెచ్ఆర్ పాఠశాలలో విద్యార్థులతో పారిశుధ్య పనులు చేయించిన సంఘటనపై ఏ ఒక్క అధికారీ నోరు మెదపకపోవడాన్ని చూసిన ప్రతి ఒక్కరూ ఇదేనా అభివృద్ధి అంటే అంటూ ప్రశ్నిస్తున్నారు. చదువుకునే పిల్లలతో ప్రమాదకర పరిస్థితుల్లో పనులు చేయించినా.. ఏఒక్క అధికారి పట్టించుకోకపోవడమేనా పవన్ పర్యావరణ పరిరక్షణ సిద్ధాంతం అని స్థానికులు నిలదీస్తున్నారు. ఏం చేసినా మమ్మల్ని అడిగేదెవరు అన్నట్టుగా ప్రజాప్రతినిధుల తీరు ఉంటే, వారి అండ చూసుకుని ప్రవర్తిస్తున్నారు అధికారులు. ఎన్నికల నియమావళిని ఉల్లంఘించి, ఎన్నికల ప్రచారం చేసిన మున్సిపల్ కమిషనర్ కనకారావుపై చర్యలు లేవు. ఉన్నతాధికారి నిర్వహించే గ్రీవెన్స్‌లో జనసేన నేతలు హల్‌చల్ చేసినా చర్యలు శూన్యం. ప్రమాదకర పరిస్థితుల్లో విద్యార్థులతో పని చేయించిన ఉపాధ్యాయులపై చర్యలు అసలు లేవు.. ఇలా ఒకటి కాదు, రెండు కాదు ప్రతి నేత చట్టాన్ని ఉల్లంఘిస్తున్నా.. అధికారులు తమ పరిధిని దాటి ప్రజా వ్యతిరేక కార్యక్రమాలు చేస్తున్నా.. ఎవరూ పట్టించుకునే వారు లేరు.



సభా స్థలి నుంచి చెత్త తరలించే పనిలో మున్సిపల్ పారిశుధ్య వాహనం

పర్యావరణానికి 'మంట'



సభా ప్రాంగణం వద్ద ప్లాస్టిక్ వ్యర్థాలకు పెట్టిన మంట

జనసేన ఆవిర్భావ సభ అనంతరం పేరుకుపోయిన ప్లాస్టిక్ చెత్తను డంపింగ్ యార్డుకు తరలించాల్సి ఉండగా, జనసేన నేతలు ఎక్కడికక్కడ పోగేసి, మంట పెట్టేశారు. దీంతో పచ్చని చెట్లతో ఆహ్లాదంగా ఉండే చిత్రాడ, పరిసర ప్రాంతాలు కాలుష్యంతో నిండిపోయాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పారిశుధ్య పనులకు కమిటీ వేసినట్టు చెప్పు కొన్న జనసేన నేతలు.. నిజానికి వారు పెత్తనం చేసి, ఇతరులతో పని చేయించడమే కాకుండా, పర్యావరణానికి మంట పెట్టారని స్థానికులు విమర్శిస్తున్నారు.

పార్టీ పనులకు ఉపాధి కూలీలు

చిత్రాడ జనసేన సభా ప్రాంగణంలో పేరుకుపోయిన చెత్త తొలగించడానికి రోజుకు 80 మంది చొప్పున ఉపాధి కూలీలను వినియోగించడం తీవ్ర విమర్శలకు దారితీసింది. ఉపాధి కూలీలను ప్రైవేటు పనులకు ఉపయోగించరాదన్న కీలక నియమాన్ని తుంగలోకి తొక్కిన జనసేన నేతలు.. ఉపాధి కూలీలతో పారిశుధ్య పనులు చేయించారు. ఐదు రోజులుగా పని చేయించుకున్న జనసేన నేతలు కూలీలకు దగ్గరుండి మస్టర్లు వేయించడం, ఉపాధి సిబ్బందితో దగ్గరుండి పనులు చేయించడం వారి అధికార దుర్వినియోగానికి అద్దం పడుతోందని స్థానికులు పెదవి విరుస్తున్నారు.



జనసేన సభా ప్రాంగణాన్ని శుభ్రం చేస్తున్న ఉపాధి కూలీలు

గంజాయి విక్రేతల ముఠా అరెస్టు

- నిందితుల్లో ఆరుగురు యువకులు
- 11 కేజీల సరుకు, ఇతర వస్తువులు స్వాధీనం

నిడదవోలు: గంజాయి విక్రయిస్తున్న ఆరుగురు యువకుల ముఠాను నిడదవోలు పోలీసులు అరెస్టు చేశారు. నిడదవోలు సీఐ పీవీజీ తిలక్ బుధవారం విలేకర్లకు ఈ వివరాలు వెల్లడించారు. పట్టణంలో వైఎస్సార్ కాలనీలోని మానే గాంధీ పొలంలో పంపు షెడ్డు వద్ద కొందరు యువకులు గంజాయిని కలిగి ఉన్నారనే సమాచారంతో మంగళవారం సాయంత్రం పట్టణ ఎస్సై జీఎస్ఆర్‌కే పరమహంస తన సిబ్బందితో దాడి చేశారు. పట్టణానికి చెందిన కొందరు యువకులు ఒడిశాలోని మల్కాన్‌గిరి జిల్లా కామన్‌గూడ ప్రాంతం నుంచి కేజీ గంజాయిని రూ.3 వేల చొప్పున కొనుగోలు చేసి, నిడదవోలుకు తీసుకొచ్చారు. మానే గాంధీ పొలంలో పంపు షెడ్డు వద్ద వేయింగ్ మెషీన్‌పై తూచి, ప్యాకెట్లుగా తయారు చేసి విక్రయిస్తున్నారు. ఈ క్రమంలో పోలీసులు దాడి చేసి, పట్టణంలోని కుమ్మరి వీధికి చెందిన దాసరి పృథ్వీవెంకటసాయి నితీష్, జగనన్న కాలనీకి చెందిన గడిచుకోట భానుప్రకాష్, వైఎస్సార్ కాలనీకి చెందిన షేక్ బషీర్, చర్చిపేటకు చెందిన అక్కాబత్తుల బాలు, సింగవరం గ్రామానికి చెందిన మద్దాల భానుప్రకాష్, తిమ్మరాజుపాలెం గ్రామానికి చెందిన పడాల భాగ్య శివసుబ్రహ్మణ్యంను అరెస్టు చేశారు. నిందితులను రిమాండ్‌కు పంపించినట్టు సీఐ తిలక్ తెలిపారు. వీరి వద్ద నుంచి రూ.55 వేల విలువైన 11 కేజీల గంజాయి, నాలుగు సెల్‌ఫోన్లు, మోటార్ బైక్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఈ నేపథ్యంలో జిల్లా ఎస్పీ నరసింహ కిషోర్ నిడదవోలు పోలీసులను అభినందించారు.



వివరాలు వెల్లడిస్తున్న సీఐ తిలక్



స్వాధీనం చేసుకున్న గంజాయి, ఇతర వస్తువులు

త్వరలో అసంపూర్తి భవనాలను పూర్తి చేస్తాం

ఇన్‌ఫ్రా జాయింట్ డైరెక్టర్ రామలింగం



రాయవరం: మనబడి–మన భవిష్యత్తు పథకంలో అసంపూర్తిగా ఉన్న భవనాలను త్వరలోనే పూర్తి చేయనున్నట్టు కమిషనర్ ఆఫ్ స్కూల్స్(ఇన్‌ఫ్రాస్ట్రక్చర్) ప్రోగ్రాం డైరెక్టర్ మువ్వా రామలింగం తెలిపారు. విద్యారంగ సంస్కరణల్లో భాగంగా ప్రాధాన్య క్రమంలో నిధులను కేటాయించి, పనులను పూర్తి చేయనున్నట్టు చెప్పారు. మండలంలో పదో తరగతి పాఠశాలల తనిఖీ సందర్భంగా బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రభుత్వం సీబీఎస్ఈ, హైస్కూల్ ప్లస్ పాఠశాలలను విరమించుకునే ఆలోచనలో ఉన్న నేపథ్యంలో, ప్రస్తుత సంస్కరణలకు అనుగుణంగా పనులను పూర్తి చేస్తామన్నారు. వచ్చే విద్యా సంవత్సరానికి అసంపూర్తిగా ఉన్న భవనాలను పూర్తి చేసేందుకు శాయశక్తులా కృషి చేయనున్నట్టు తెలిపారు. మనబడి–మన భవిష్యత్తులో తాగునీరు, విద్యుద్దీకరణ, కిచెన్ షెడ్లు, టాయిలెట్లు, మేజర్, మైనర్ రిపేర్లు, గ్రీన్‌చాక్ బోర్డు, పెయింటింగ్ వంటి పనులను విద్యార్థుల సంఖ్యతో సంబంధం లేకుండా పూర్తి చేస్తామని వివరించారు. అదనపు తరగతి గదుల నిర్మాణాన్ని విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా పూర్తి చేస్తామన్నారు. సిమెంట్ అవసరమైన పాఠశాలల్లో నిర్మాణాలకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్టు తెలిపారు.

జిల్లాలో పది పరీక్షల్లో మాల్ ప్రాక్టీస్‌కు అవకాశం లేనట్టు నిర్వహిస్తున్నట్టు పరీక్షల రాష్ట్ర పరిశీలకుడు రామలింగం తెలిపారు. చెల్లూరు, పసలపూడి పరీక్షా కేంద్రాలను తనిఖీ చేశారు. విద్యార్థులకు ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకున్నారన్నారు. కింద కూర్చుని పరీక్షలు రాయకుండా, అన్నిచోట్ల ఫర్నిచర్‌ను ఏర్పాటు చేశారన్నారు.

పోలీసుల అదుపులో కర్కశ తండ్రి!

రామచంద్రపురం రూరల్: కన్న బిడ్డలను పంట కాలువలోకి తోసేసిన కర్కశ తండ్రి పోలీసులకు లొంగిపోయినట్టు సమాచారం. రాయవరం మండలం వెంటూరుకు చెందిన పిల్లి రాజు సోమవారం రామచంద్రపురం మండలం నెలపర్తిపాడు శివారు గణపతినగరం సమీపంలోని పంట కాలువలో తన బిడ్డలు పదేళ్ల రామసందీప్, ఏడేళ్ల కారుణ్యశ్రీని తోసేసిన ఘటనలో, సందీప్ బతికి బయటపడగా, కారుణ్య నీటమునిగి చనిపోయిన సంగతి విదితమే. అప్పుల నేపథ్యంలో పిల్లలను చంపి, తానూ ఆత్మహత్య చేసుకునేందుకు ఇలా చేసి ఉండొచ్చనే కోణంలో పోలీసులు కాలువలు, గోదావరి వెంబడి పిల్లి రాజు ఆచూకీ కోసం రెండు రోజులుగా గాలించారు. ఈ క్రమంలో యానాం బ్రిడ్జిపై రాజు స్కూటర్ కనిపించడంతో, వారి అనుమానం బలపడింది. రామచంద్రపురం సీఐ వెంకటనారాయణ, ద్రాక్షారామ ఎస్సై ఎం.లక్ష్మణ్ బోటుపై గోదావరిలో విస్తృతంగా గాలించారు. అయితే నిందితుడు రాజు మండపేట రూరల్ పోలీస్ స్టేషన్‌లో లొంగిపోయినట్టు తెలిసింది. పోలీసులు దీనిని గోప్యంగా ఉంచడం గమనార్హం.



యానాం బ్రిడ్జిపై రాజు స్కూటర్

ఐడీఎస్‌పీ బృందం పర్యటన

డయేరియా రోగుల నుంచి వివరాల సేకరణ

సాక్షి ఇంపాక్ట్

గోపాలపురం: 'పల్లెల్లో పారిచోద్యం' శీర్షికన 'సాక్షి'లో ప్రచురితమైన వార్తకు బుధవారం వైద్యారోగ్య శాఖ, పంచాయతీ అధికారులు స్పందించారు. గోపాలపురం, పెద్దగూడెం, చిట్యాల, తొక్కిరెడ్డిగూడెం తదితర డయేరియా ప్రభావిత గ్రామాల్లో పారిశుధ్య పనులు వేగవంతం చేశారు. పెద్దగూడెం, ఉప్పరగూడెం గ్రామాల్లో పేరుకుపోయిన చెత్తాచెదారాలను యంత్రాల సాయంతో ట్రాక్టర్లు, లారీలపై డంపింగ్ యార్డుకు తరలించారు. వివిధ గ్రామాల్లో శానిటేషన్ పనులు చేపట్టారు. నాలుగు రోజులుగా డయేరియా కేసులు నమోదైన నేపథ్యంలో వైద్య శిబిరాలు ఏర్పాటు చేయడం వల్ల కొత్త కేసులు నమోదు కాలేదని గోపాలపురం సీహెచ్‌సీ సూపరింటెండెంట్ కె.చైతన్యరాజు తెలిపారు.

బాధితుల ఇళ్లకు వెళ్లి..

అతిసారంతో సుమారు 30 మంది డయేరియా బారిన పడిన సంగతి విదితమే. ఈ నేపథ్యంలో బుధవారం రాష్ట్ర ఇంటిగ్రేటెడ్ డిసీజ్ సర్వైలెన్స్ ప్రోగ్రాం బృందం(ఐడీఎస్‌పీ) గోపాలపురం సీహెచ్‌సీని సందర్శించింది. ఆస్పత్రిలో చికిత్స పొందిన వారి వివరాలు సేకరించి, బాధితుల ఇళ్లకు వెళ్లి ఆరా తీసింది. అతిసారానికి కారణాలు, పారిశుధ్యం, తాగునీరు వంటి అంశాలపై బృంద సభ్యులు ప్రజలతో మాట్లాడారు. గోపాలపురం, పెద్దగూడెం, వేళ్లచింతలగూడెం, చిట్యాల, గుడ్డిగూడెం, పెద్దాపురం గ్రామాల్లో స్థితిగతులను పరిశీలించారు. వీరి వెంట ఆస్పత్రి సూపరింటెండెంట్ కె.చైతన్యరాజు, వైద్యారోగ్య, పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు ఉన్నారు.



గోపాలపురం సీహెచ్‌సీలో రోగుల నుంచి వివరాలు సేకరిస్తున్న ఐడీఎస్‌పీ సభ్యులు



పెద్దగూడెంలో పారిశుధ్య పనులు చేపట్టిన సిబ్బంది

బాణసంచా తయారీలో నిబంధనలు పాటించాలి

కరప: బాణసంచా తయారీదారులు తప్పనిసరిగా నిబంధనలు పాటించాలని కాకినాడ ఏడీఎఫ్ఓ పి.ఏసుబాబు అన్నారు. వేళంగిలో బుధవారం ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా బాణసంచా తయారీదారుల సంఘ సమావేశంలో ఆయన మాట్లాడారు. బాణసంచా తయారీ, విక్రయదారులు తప్పనిసరిగా లైసెన్స్ కలిగి ఉండాలన్నారు. తయారు చేసే ప్రాంతంలో ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు, అగ్నిప్రమాద నివారణ చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సందర్భంగా బాణసంచా తయారీదారుల సంక్షేమ సంఘ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షునిగా వెలుగుబంట్ల సత్యనారాయణ, అధ్యక్షుడిగా కొప్పిశెట్టి శ్రీనివాసరావు, కోశాధికారిగా జీవీవీ సత్యనారాయణ, కార్యదర్శిగా కె.విజయ్‌కుమార్, కె.దుర్గారావు, ఉపాధ్యక్షులుగా విస్సుకోటి శ్రీనివాసరావు, సయ్యద్ బాజీబేగ్, ఎస్.దుర్గాప్రసాద్ ఎన్నికయ్యారు.

హత్య కేసులో నిందితుడికి జీవిత ఖైదు

ధవళేశ్వరం: నేరం రుజువు కావడంతో హత్య కేసులో నిందితుడు దాడి గణేష్‌కు జీవిత ఖైదు, రూ.5 వేల జరిమానా విధిస్తూ ఐదో అదనపు జిల్లా సెషన్స్ జడ్జి డి.విజయగౌతమ్ బుధవారం తీర్పు ఇచ్చారు. పోలీసుల వివరాల మేరకు, నర్సీపట్నం మండలం చెట్టిపల్లి గ్రామానికి చెందిన దాడి గణేష్ 12 ఏళ్ల క్రితం ధవళేశ్వరం గ్రామానికి చెందిన వరలక్ష్మిని ప్రేమించి, పెద్దల అంగీకారంతో వివాహం చేసుకున్నాడు. ధవళేశ్వరం ఎర్రకొండలో నివాసం ఉండేవారు. 2019 జనవరి 28న తన భార్య ఎవరితోనే ఫోన్ మాట్లాడుతుందనే అనుమానంతో పీటతో తలపై మోది, చాకుతో పొడిచి ఆమెను హతమార్చాడు. ఆమె సోదరుడు కుంచాల శ్రీను ఫిర్యాదు మేరకు అప్పటి సీఐలు బాలశౌరి, ఎ.శ్రీను, ఎస్సై ఎస్.వెంకయ్య చార్జిషీట్‌లు దాఖలు చేశారు. ప్రాసిక్యూషన్ తరఫున గ్రేడ్–1 స్పెషల్ పీపీ కె.లక్ష్మానాయక్ వాదించారు. కేసును పర్యవేక్షించిన ధవళేశ్వరం సీఐ టి.గణేష్ ,హెచ్‌సీ బి.జయరామ్‌రాజును ఎస్పీ బి.నరసింహ కిషోర్ అభినందించారు.

రైతు బలవన్మరణం

నల్లజర్ల: కారణమేంటో తెలియదు కానీ మండలంలోని తెలికిచెర్లలో బుధవారం తెల్లవారుజామున రైతు బుడిగిన శ్రీను(48) తన పొలంలో బలవన్మరణానికి పాల్పడ్డాడు. పొలంలో మామిడిచెట్టుకు ఉరి వేసుకున్నాడు. అతడికి భార్య, ఇద్దరు మగ పిల్లలున్నారు. అతడి మరణానికి కారణం తెలియదని బంధువులు తెలిపారు. పామాయిల్ తోట వద్ద మామిడి చెట్టుకు అతడి మృతదేహం వేలాడుతుండడాన్ని స్థానికులు గుర్తించి, పోలీసులకు సమాచారం అందించారు. ఏఎస్సై శోభనాద్రి కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.



బుడిగిన శ్రీను మృతదేహం

నదీ పాయలో బాట నిర్మాణం

- మానేపల్లిలంక వద్ద పొక్లెయిన్లతో 2 కి.మీ. ఏర్పాటు
- కూటమి నేతల కనుసన్నల్లో ర్యాంపు నిర్వహణ!

పి.గన్నవరం: పెదకందాలపాలెం ర్యాంపు నుంచి మానేపల్లి లంక వరకూ సుమారు 2 కి.మీ మేర నదీపాయలో తువ్వ మట్టి లారీల రాకపోకల కోసం పొక్లెయిన్లతో బాటలు నిర్మిస్తున్నారు. నేషనల్ హైవే పనుల కోసం తువ్వ మట్టిని తరలించేందుకు ఈ బాటలు ఏర్పాటు చేస్తున్నట్టు నిర్వాహకులు చెబుతున్నారు. ఇందుకు ఉన్నతాధికారుల నుంచి అనుమతులు తెచ్చుకున్నామని చెబుతున్న నిర్వాహకులు మాత్రం వాటిని ఎవ్వరికీ చూపడం లేదు. ఇంతవరకూ స్థానిక రెవెన్యూ అధికారులకు కూడా అనుమతి పత్రాలు అందలేదు. కూటమి నేతల కనుసన్నల్లో మట్టి తరలింపునకు సన్నాహాలు జరుగుతున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు.

మూతపడిన ర్యాంపు!

ఇటీవల పెదకందాలపాలెం నుంచి అనుమతులు లేకుండా కూటమి నాయకులు ఇసుక, మట్టిని కొల్లగొట్టడంపై పత్రికల్లో కథనాలు రావడంతో ఈ ర్యాంపు మూతబడిన విషయం విదితమే. ఈ నేపథ్యంలో మూడు రోజులుగా పెదకందాలపాలెం ర్యాంపు నుంచి మానేపల్లి పల్లిపాలెం లంక వరకూ నదీపాయ వెంబడి పొక్లెయిన్లతో బాటలు వేస్తున్నారు. అనుమతులు లేకుండా టిప్పర్లలో తువ్వ మట్టిని తరలించుకుపోతున్నారని బుధవారం స్థానికులు అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో ఆర్ఐ వి.డాంగే, వీఆర్వో వి.సత్యనారాయణ ర్యాంపులోకి వెళ్లారు. నేషనల్ హైవే పనుల కోసం మట్టిని తరలించేందుకు అనుమతులు తెచ్చుకున్నట్టు నిర్వాహకులు తెలిపారు. ర్యాంపులోకి వెళ్లే ముందు రోడ్డుపై మట్టి లోడుతో వెళ్తున్న లారీని అధికారులు నిలిపి వీఆర్ఏని కాపలా ఉంచారు. ఈలోగా ర్యాంపు నిర్వాహకులు అక్కడికి వెళ్లి బిల్లు ఉందంటూ లారీని పంపించేశారు. ఈ క్రమంలో స్వల్ప వివాదం కూడా జరిగింది. ఇలాఉండగా మానేపల్లిలంక నుంచి మట్టిని తీసే అనుమతులతో.. పెదకందాలపాలెం లంక పరిసరాల్లో కూడా పెద్దఎత్తున మట్టిని తరలించుకుపోయేందుకు కూటమి నేతలు సన్నాహాలు చేస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. అందుకే నదీపాయలో రెండు కి.మీ. మేర బాట నిర్మించారని చెబుతున్నారు.

అనుమతి పత్రాలు రావాలి

మానేపల్లి లంక నుంచి హైవే పనుల కోసం మట్టిని తరలించేందుకు అనుమతి ఇచ్చినట్టు మైన్స్ అధికారులు తనకు చెప్పారని తహసీల్దార్ పి.శ్రీపల్లవి తెలిపారు. వారి నుంచి సంబంధిత పత్రాలు రావాల్సి ఉందన్నారు.



మానేపల్లి లంకలో బాటను నిర్మిస్తున్న పొక్లెయిన్లు

రేషన్ బియ్యం పట్టివేత

మధురపూడి: కోరుకొండ మండలంలో తరలిస్తున్న 1,500 కేజీల రేషన్ బియ్యం వాహనాన్ని బుధవారం పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. కోరుకొండ ఎస్సై టి.శ్యామ్‌సుందర్ వివరాల మేరకు, జంభూపట్నం శివారులో వాహనాలను తనిఖీ చేస్తుండగా, బొలేరో వాహనం 30 బియ్యం మూటలతో తారసపడింది. వేగంగా వాహనంతో పరారవుతుండగా, పోలీసులు వెంబడించి పట్టుకున్నారు. కాపవరం గ్రామానికి చెందిన తలారి వీరబాబు దీనిని తరలిస్తున్నట్టు గుర్తించారు. నిందితుడిపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తెలిపారు.

మద్యం మత్తులో లారీ డ్రైవర్ హల్‌చల్

వాహనాలు, మహిళపైకి దూసుకెళ్లిన వైనం

కరప: ఫూటుగా మద్యం తాగి.. కొన్ని వాహనాలు, ఓ మహిళపైకి లారీని దూకించి హల్‌చల్ చేసిన లారీ డ్రైవర్‌కు స్థానికులు దేహశుద్ధి చేసి, పోలీసులకు అప్పగించిన ఘటన కరప మండలం వేళంగిలో జరిగింది. స్థానికుల వివరాల మేరకు, కాజులూరు మండలం కుయ్యేరుకు చెందిన బండి బేబీ మండలంలోని కూరాడ గ్రామంలోని పుట్టింటికి వచ్చింది. బుధవారం మధ్యాహ్నం తిరిగి వెళ్లేందుకు వేళంగిలోని నిత్యానందపుర సెంటర్‌లో బస్సు కోసం వేచిచూస్తోంది. అదే సమయంలో రామచంద్రపురం నుంచి కాకినాడకు వెళుతున్న లారీ.. ముందుగా ఆటోను, బజ్జీల బండిని ఢీకొని, అక్కడున్న బేబీపైకి దూసుకెళ్లింది. ఈ ఘటనలో ఆమె తలకు తీవ్ర గాయమైంది. ఆమెను స్థానిక పీహెచ్‌సీకి తరలించారు. మద్యం మత్తులో ఉన్న లారీడ్రైవర్‌ను స్థానికులు పట్టుకుని, దేహశుద్ధిచేసి, కరప పోలీసులకు అప్పగించారు.